క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి పూర్ణిమాదేవి

పాకాల : ప్రజలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని పాకాల కోర్టు న్యాయమూర్తి పూర్ణిమాదేవి తెలిపారు. శనివారం స్థానిక సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ ఎస్.కస్తూరి, తహసీల్దార్ సంతోష్ సాయి, కార్యదర్శి లావణ్యలత, ఏఎస్ఐ వెంకటరత్నం, న్యాయవాదులు గురుస్వామినాయుడు, గౌరీశంకర్‌రాజు, ఎస్ఎస్ఎం.సలీమ్, ప్రవీణ్‌ప్రకాష్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో 'నిరంతర వైద్యవిద్య'

తిరుపతి తుడా : స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్, మైక్రోబయాలజీ, రుమటాలజీ విభాగాల ఆధ్వర్యంలో శనివారం పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్య పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రుమాటలాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ పోస్ట్‌-వైరల్ ఆర్థ్రాల్జియా పరిచయం ఎటియాలజీ, క్లినికల్ ప్రజెంటేషన్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణ, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ రవి శంకర్ పాల్గొన్నారు.

ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా రవిప్రభు

తిరుపతి తుడా : ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభును నియమిస్తూ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ రాధ బాధ్యతలు చేపట్టి రెండు రోజులు గడవక ముందే ఆమెను రుయా సూపరింటెండెంట్‌గా బదిలీ చేయడం గమనార్హం.

భక్తిశ్రద్ధలతో సంకీర్తన



కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్ : భజన మండలి సభ్యులు శనివారం వేకువ జామున శ్రీగోవిందరాజ స్వామి మాడవీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మునినాథరెడ్డి, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ,పొన్నాల జేజిరెడ్డి, మధు, కేశవరెడ్డి, కల్యాణి, మురళి, కళావతి, పార్వతి, జయమ్మ, సుభద్రమ్మ, అరుణ, లీలావతి పాల్గొన్నారు.

వేదిక్ వర్సిటీలో వేసవి శిబిరం

తిరుపతి సిటీ : ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో వైదిక, యోగా కోర్సులకు సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా వేసవి శిబిరం ప్రారంభించనున్నట్లు వర్సిటీ అధికారులు శనివారం తెలిపారు. ఈనెల 7వ తేదీన ప్రారంభించి జూన్ 5 వరకు తిరుపతి వాసులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 99491 91999 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేణుగోపాల్‌నాయుడికి నివాళి



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : మండలంలోని అనంత గుర్రప్పగారి పల్లెకు మేడసాని వేణు గోపాల్ నాయుడు శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం వెళ్లి వేణుగోపాల్‌నాయుడు భౌతికకాయానికి నివాళులర్పించారు. నేతలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, కోటేశ్వర రెడ్డి, అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ చంద్రమౌళి రెడ్డి, రాజ శేఖర్, ప్రసాద్ రెడ్డి, రమేష్ రెడ్డి, కుప్పి రెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా




లీలాచంద్ (ఫైల్)

పాకాల: ఈత సరదా ఓ బాలుడి ప్రాణం తీసింది. వివరాలు.. అరగొండ గొల్లపల్లెకు చెందిన ముత్యాలు, మైథిలి దంపతుల కుమారుడు లీలాచంద్(14). ఉప్పరపల్లి పంచాయతీ తువ్వచేను ఒడ్డిపల్లిలో ఉంటున్న అమ్మమ్మ సుజాత ఇంటికి వచ్చాడు. శనివారం తల్లితో కలిసి బట్టలు ఉతకడానికి అబ్బానాయుడుఇండ్లు చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు చెరువులోకి దిగి గల్లంతయ్యాడు. గమనించిన తల్లి కేకలు వేసింది. పశువుల కాపరులు, గ్రామస్తులు చెరువులో దిగి బాలుడిని వెలికి తీసి పి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

చిరు వ్యాపారుల ఆందోళన

తిరుపతి తుడా : తిరుపతి కార్పొరేషన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు చిరు వ్యాపారులపై దౌర్జన్యాలకు పూనుకోవడం సిగ్గుచేటని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, వీధి వర్తక వ్యాపార కార్మిక ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ శివకుమార్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఈ మేరకు చిరు వ్యాపారులతో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయం ఆందోళనకు దిగారు.

● సుమ శోభితం



శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో శనివారం కనులపండువగా పుష్ప యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాలక్ష్మణ సమేత స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం పుష్పయాగంలో భాగంగా అర్చకులు 108 సార్లు విష్ణు గాయత్రి మంత్రం పఠించారు. అనంతరం 3 టన్నుల విరులతో పుష్పాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగించారు. – తిరుపతి కల్చరల్

● సేవా సౌరభం



ఎండ తీవ్రత నుంచి వాహనదారులకు ఉపశమనం కలిగించేందుకు సేవాధృక్పథంలో ఆర్యవైశ్య సంఘం వారు నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ మ్యాట్‌తో పందిళ్లు ఏర్పాటు చేశారు. పర్మినెంట్ స్ట్రక్చర్‌తో ఐరన్ ఫ్రేమ్స్ అమర్చి పైన గ్రీన్ మ్యాట్లు వేయించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

దోపిడీకి తొలిమెట్టు

తిరుమల శ్రీవారి భక్తులను ఆటోవాలాలు నిలువుదోపిడీ చేస్తున్నారు. కలియుగ వైకుంఠానికి వెళ్లేలోపే చుక్కలు చూపిస్తున్నారు. దర్శన టోకెన్లు సైతం ఇప్పిస్తామని మాయమాటలు చెబుతున్నారు. నమ్మిన వారి నుంచి రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవుల నేపథ్యంలో భారీగా తరలివస్తున్న భక్తులకు కుచ్చు టోపీ పెట్టేస్తున్నారు. ఏడుకొండలకు చేరుకోకముందే తిరుక్షవరం చేసేస్తున్నారు. టీటీడీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆటోవాలాలు రోజు రోజుకూ చెలరేగిపోతున్నారు. అడిగినంత ఇవ్వని వారిపై దాడులకు సైతం తెగబడుతున్నారు.

- శ్రీవారి మెట్టు వద్ద భక్తుల అగచాట్లు
- ఒక్కొక్కరి నుంచి రూ.500 గుంజేస్తున్న ఆటోవాలాలు
- దర్శన టోకెన్లు ఇప్పిస్తామని మాయమాటలు



శ్రీవారి దర్శన టోకన్ల కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

చంద్రగిరి : తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు కొండ కిందే శ్రీవారి మెట్టు వద్ద నిలువదోపిడికి గురవుతున్నారు. వ్యయ ప్రసాలతో స్వామి దర్శనం చేసుకుంటే చాలు అనుకునే భక్తుల నుంచి ఆటోవాలాలు అందినకాడికి వసూలు చేసేస్తున్నారు. సుమారు మూడు నెలలుగా ఈ దందా కొనసాగుతున్నా టీటీడీ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. వారాంతపు సెలవులతో పాటు శనివారం కావడంతో కాలినడకన తిరుమలకు చేరుకోవడానికి శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారి మెట్టు వద్దకు వేకువజామునే భక్తులు పోటెత్తారు. కార్లు, బస్సులు, ఆటోలు భారీగా చేరుకోవడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలను క్రమబద్ధీకరించేందుకు పోలీసు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది కనిపించకపోవడంతో గంటల తరబడి భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

రూ.వేలు గుంజేస్తున్నారు!

శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారి మెట్టు చేరుకునేందుకు కేవలం 6 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. అయితే ఈ కాస్తంత దూరాన్ని రద్దీ దృష్ట్యా ఆటో వాలాలు ఆసరాగా చేసుకున్నారు. ఆటోడ్రైవర్లందరూ సిండికేట్‌గా మారి భక్తుల జేబుకు చిల్లుపెట్టేస్తున్నారు. శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టు చేర్చేందుకు ఒక్కో భక్తుడి నుంచి రూ.500ల వరకు వసూలు చేస్తున్నారు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే.. పోలీసులకు సైతం వాటాలు ఇవ్వాలని దబాయిస్తున్నారు. తిరుపతి నుంచి శ్రీవారిమెట్టుకు బృందంగా ఉన్న భక్తులను టార్గెట్ చేసుకుని రూ.వేలు గుంజేస్తున్నారు. ఆటోలో దింపడంతో పాటు శ్రీవారి దర్శన టోకెన్లను సైతం ఇప్పిస్తామని చెప్పడంతో భక్తులు సులువుగా వారి వలలో పడిపోతున్నారు. దర్శన టోకెన్ల వద్ద టీటీడీ విజిలెన్స్ సిబ్బందితో ఆటోవాలాలు ఒప్పందం కుదుర్చుకుని అక్రమాలకు పాల్పడుతున్నట్లు పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. శ్రీవారి మెట్టు వద్ద టోకెన్లు నామమాత్రంగా ఇస్తుండడంతో డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఇదే అదునుగా ఆటోడ్రైవర్లు యథేచ్ఛగా దందా సాగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



శనివారం ఉదయం శ్రీవారి మెట్టు మార్గంలో భారీగా నిలిచిన వాహనాలు

అర్హులందరికీ టీడీఆర్ బాండ్లు

తిరుపతి తుడా : మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన అర్హులందరికీ టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నామని కమిషనర్ మౌర్య తెలిపారు. శనివారం 38 మందికి టీడీఆర్ బాండ్లు అందించారు. కమిషనర్ మాట్లాడుతూ 556 మందికి గాను 239 మందిని అర్హులను గుర్తించామన్నారు. అందులో ఇప్పటి వరకు 65 మందికి టీడీఆర్ బాండ్లు అందజేశామని వివరించారు. మిగిలిన 174 మంది గిఫ్ట్ డీడ్ ఇవ్వగానే, బాండ్లు ఇస్తామని వెల్లడించారు.

పక్కాగా జాతర ఏర్పాట్లు



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : తాతయ్యగుంట గంగమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు 5వ తేదీ లోపు పక్కాగా ఏర్పాట్లు ,చేయాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం ఈ మేరకు గంగజాతర ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ఆర్డీఓ రామ్మోహన్, డీఎస్పీలు రామకృష్ణాచారి, భక్తవత్సల నాయుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఆలయ ఈఓ జయకుమార్ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- మహతిలో తిరుపతి వాసులకు, తిరుమల బాలాజీనగర్‌లో స్థానికులకు ఉదయం 5 గంటల నుంచి శ్రీవారి దర్శన టోకెన్ల పంపిణీ.
- పీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 8 నుంచి అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్స్ సంఘం వార్షికోత్సవం.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు నాటక పోటీలు.
- జిల్లాలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నీట్ యూజీ–2025.

ఫోన్ హ్యాక్ చేసి రూ.5.32 లక్షలు స్వాహా

తిరుపతి రూరల్ : ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ.5.32 లక్షలను స్వాహా చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ మండలం చిగురువాడకు చెందిన యువకుడు చెన్నైకి చెందిన ఫుజిట్సు కన్సల్టెంగ్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌లో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఇంటి నుంచే విధులు నిర్వహిస్తున్నాడు. కంపెనీ పని ఒత్తిడి అధికంగా ఉండడంతో ఫోన్‌ను వినియోగించలేదు. దీంతో తన వద్దనున్న రెడ్‌మీ నోట్ 12 ప్లస్ ప్రో మొబైల్ వినియోగం పూర్తిగా తగ్గించేశాడు. గత నెల 22వ తేదీ సాయంత్రం తన ఫోన్ చూడగా వేడిగా ఉండడాన్ని గమనించాడు. అప్లికేషన్ లిస్ట్ చూడగా పేరులేని ఎరుపు రంగులో ఉన్న అనుమానిత యాప్ కనిపించింది. దాన్ని తొలగించాడు. ఆ వెంటనే గ్లోబల్ ఎక్స్‌ట్రా.కమ్ అనే వెబ్‌సైట్ ఓపెన్ కావడం గమనించి బ్రౌజర్‌ను కూడా క్లోజ్ చేశాడు. ఇక ఏమీ కాదులే అని మిన్నకుండిపోయాడు. శుక్రవారం అతని ఐసీఐసీఐ బ్యాంకు అకౌంట్ 625201536243ను చెక్ చేయగా ఐదు అనుమానిత ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రూ.5,32,281లు డ్రా చేసినట్టు గుర్తించాడు. వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా వారు అతని డెబిట్ కార్డును పర్మినెంట్‌గా బ్లాక్ చేసి అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారు. అనంతరం 1930కు ఫిర్యాదు చేశాడు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు శనివారం కేసు నమోదు చేశారు.

సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో రద్దీ అధికంగా ఉంది. సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,344 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారికి హుండీలో రూ.2.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రాక్ శాస్త్రి కోర్సులకు దరఖాస్తులు

తిరుపతి సిటీ: పదో తరగతి పూర్తి చేసి సంస్కృతంతో పాటు ఆధునిక విషయాలను అధ్యయనం చేసే వారి కోసం ప్రాక్ శాస్త్రి (ఇంటర్మీడియట్) కోర్సు ప్రవేశపెట్టినట్టు జాతీయ సంస్కృత వర్సిటీ అధికారులు తెలిపారు. ఇందులో సంస్కృతంలోని శాస్త్రాలతో పాటు ఆంగ్లం, హిందీ, తెలుగు భాషలు, కంప్యూటర్, మ్యాథ్స్, యోగా, భరత నాట్యం, సితార, ట్రాన్స్‌లేషన్ కోర్సులు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జూనియర్ కళాశాలలపై చర్యలకు వినతి

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు కోరారు. శనివారం ఈ మేరకు ఆర్ఐఓకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ మే 12నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో రెమిడియల్ తరగతులు నిర్వహించుకోవచ్చని బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇదే అదునుగా వేసవి సెలవులు ఉన్నప్పటికీ కొన్ని కళాశాలలు అడ్మిషన్లు చేసుకుంటూనే తరగతులను నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ఎంసెట్ కోచింగ్ పేరుతో వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఐఓ స్పందిస్తూ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి తేజ, శివ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథరెడ్డి కుటుంబీకులకు పరామర్శ



పాకాల : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి



చంద్రగిరి : పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

పాకాల : వైఎస్సార్‌సీపీ నేత విశ్వనాథరెడ్డి కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పరామర్శించారు. శనివారం స్థానిక శివశక్తి నగర్‌లోని వారి నివాసానికి వెళ్లిన చెవిరెడ్డి మాట్లాడుతూ విశ్వనాథరెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. విశ్వనాథరెడ్డి సతీమణి, పాకాల ఎంపీటీసీ సభ్యులు స్వర్ణకు ధైర్యం చెప్పారు. ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సుబ్రమణ్యం మృతి తీరని లోటు

చంద్రగిరి : వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యం రెడ్డి మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. అనారోగ్యంతో ఇటీవల సుబ్రమణ్యం రెడ్డి మరణించారు.శనివారం ఈ మేరకు రెడ్డివారిపల్లెలోని ఆయన నివాసానికి చెవిరెడ్డి వెళ్లారు. ముందుగా సుబ్రమణ్యంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ఆవిర్భావం నుంచి సుబ్రమణ్యం రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, స్థానిక నేతలు శిరీష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మస్తాన్, ఒంటి శివశంకర్ రెడ్డి, కుప్పి రెడ్డి భాస్కర్, కొత్తపాటి కోటి, ఆర్ఎస్ మస్తాన్, సిద్ధిక్‌బాషా, రామ్‌తేజ్ పాల్గొన్నారు.

మహిళపై దాడి దారుణం



బాధితురాలిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : ఆటో నడుపుకుంటూ స్వతంత్రంగా జీవనం సాగిస్తున్న మహిళపై టీడీపీ నేతలు దాడి చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ, ఐద్వా నేతలు మండిపడ్డారు. వివరాలు.. మంగళం సప్తగిరినగర్‌కు చెందిన భాగ్యశ్రీ అనే మహిళపై గత నెల 27వ తేదీన టీడీపీ స్థానిక నేతలు ఎల్.సురేష్‌కుమార్, రమాదేవి, మంజుల, ప్రసన్న, పవన్, ప్రతాప్, హేమంత్ కలిసి భాగ్యశ్రీని విచక్షణారహితంగా కొట్టారు. దీంతో ఆమె కాలు విరిగిపోయింది. రుయా ఆస్పత్రిలో బాధితురాలికి శస్త్రచికిత్స సైతం చేశారు. అయితే ఈ విషయం శనివారం వెలుగులోకి రావడంతో వైఎస్సార్‌సీపీ నేత గుండ్రాజు శివశంకర్‌రాజు, ఎంపీటీసీ సభ్యుడు శ్రావణ్, వార్డు సభ్యుడు దయాకర్‌తో పాటు ఐద్వా నేతలు సాయిలక్ష్మి, జయంతి ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద మహిళపై దాడి చేసి కాలు విరగొట్టిన నిందితులను వెంటనే పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

8,9 తేదీల్లో వాణిజ్య గదుల వేలం

తిరుపతి తుడా : తుడా టవర్స్‌లో వాణిజ్య గదులను ఈనెల 8,9 తేదీల్లో ఈ–వేలం ద్వారా విక్రయించాలని తుడా ఉపాధ్యక్షులు మౌర్య ఆదేశించారు. శనివారం అన్నమయ్య కూడలి వద్ద నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 2వేల నుంచి 9వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఉన్న 31 వాణిజ్య గదులను విక్రయించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు తుడా కార్యాలయంతోపాటు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నిరుద్యోగంపై ఉద్యమం తప్పనిసరి

తిరుపతి కల్చరల్ : నిరుద్యోగ సమస్య తీరాలంటే యువత తప్పనిసరిగా ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.నారాయణ పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ కార్యాలయంలో శనివారం అఖిల భారత యువజన సమాఖ్య 66వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏటా రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ మోసం చేశారన్నారు. నవీన ఆలోచనలతో యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. నేతలు రామానాయుడు, విశ్వనాథ్, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చంద్రగిరి : తొండవాడ వెళ్లే మార్గంలో స్కూటీపై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి ముందు వెళుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

సుందరీకరణ పనులు పరిశీలన

తిరుపతి రూరల్, (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువు సుందరీకరణ పనులను తుడా వీసీ మౌర్య శనివారం పరిశీలించారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కట్టపై చేపల విక్రయం చేస్తున్న వారు పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని, లేకుంటే మరోచోటుకు వెళ్లాలని స్పష్టం చేశారు.



